క్లుప్తంగా...

ఆత్మరక్షణపై అవగాహన సదస్సు

శంషాబాద్ రూరల్: విద్యార్థులు, మహిళల రక్షణపై షీటీం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. మండలంలోని ఒయాసిస్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో షీటీం పనితీరును వివరించారు. మహిళలు ఆపద సమయంలో 100 నంబరు లేదా 94906 17444 షీటీం నంబరకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒంటరి ప్రయాణంలో సమస్యలు ఎదురైతే షీటీంను సంప్రదించి పరిష్కారం చేసుకోవాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిన్నారులకు అవగాహన కల్పించారు. ఆత్మరక్షణ విద్యలు నేర్చుకోవడంతో పాటు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో కూడా షీటీంను సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టీం హెడ్ కానిస్టేబుల్ హరిప్రసాద్‌రెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాల సందర్భంగా అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి

అత్తాపూర్: వినాయక ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తూ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి పోలీసు అధికారులకు సూచించారు. గణేష్ ఉత్సవాలు..మరోవైపు నిమజ్జన కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గణేష్ నిమజ్జన ఏర్పాట్ల సందర్భంగా అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌కు 40 మంది పోలీసు అధికారులు ఇతర ప్రాంతాల నుంచి విధులకు వచ్చినట్లు యాదగిరి తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు కాంత్ రెడ్డి, నాగరాజు, అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పత్తికుంటను సందర్శించిన సీపీ


సీపీని సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పత్తికుంటను సోమవారం రాత్రి సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం పోలీసులు, ట్రాఫిక్, జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ తదితర అధికారులతో పాటు సిబ్బంది, రాజేంద్రనగర్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశమయ్యారు. తొమ్మిదవ, 11వ రోజు రానున్న గణేష్ విగ్రహాల పరిస్థితి, దాని కోసం చేపడుతున్న ఏర్పాట్లు తదితర విషయాలపై పోలీసులతో చర్చించారు. ఈ సందర్భంగా పోలీసు శాఖ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ డివిజన్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి, అడిషనల్ డీసీపీ రేష్మీ, ఎస్పీ గంగాధర్, ఇన్‌స్పెక్టర్ నాగేంద్ర బాబు, గణేష్ ఉత్సవ కమిటీ కార్యదర్శి వై.శ్రీధర్, సాయి యాదవ్, డిప్యూటీ కమిషనర్ రవికుమార్, మల్లారెడ్డి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రూ. లక్షలు పలుకుతున్న వినాయక లడ్డూలు


హాల్ మార్క్ విసినియా లడ్డూను దక్కించుకున్న జైపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి

మణికొండ: వారం రోజులుగా వినాయకుల చేతుల్లో పూజలందుకున్న లడ్డూలు లక్షలు పలుకుతున్నాయి. గతంలో గ్రామాల్లో ప్రతి సంవత్సరం ప్రతిష్ఠించే పెద్ద వినాయకుల వద్దనే లడ్డూలు లక్షలు పలికేవి. ఈ సంవత్సరం గేటెడ్ కమ్యూనిటీలు సైతం అదే దారి పట్టాయి. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని గంగోత్రి నక్షత్ర అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన లడ్డూ వేలంలో పదుల సంఖ్యలో నివాసితులు పోటీ పడ్డారు. అందులో పి.నరేంద్ర రూ.5లక్షల 2వేలకు దక్కించుకున్నారు. అతనికి అపార్ట్‌మెంట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.బాల్‌రెడ్డి లడ్డూను అందజేశారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని హాల్‌మార్క్ విసినియా అపార్ట్‌మెంట్‌లోని వినాయకుని చేతిలోని లడ్డూను వేలం పాటలో ఎ.జైపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలు రూ. 4లక్షల 10వేలకు దక్కించుకున్నారు.


గంగోత్రి నక్షత్ర అపార్ట్‌మెంట్ లడ్డూను దక్కించుకున్న నరేంద్ర కుటుంబం


బుద్వేల్‌లో...


భగవతిగూడలో...


గణేష్ నిమజ్జనానికి తరలివస్తున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులు

దండాలయ్యా..ఉండ్రాళ్లయ్యా..

రాజేంద్రనగర్ జోన్ పరిధిలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గణనాథుల మండపాల వద్ద సోమవారం మండప నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీ నేతలు మండపాల వద్దకు వచ్చి గణనాథులను దర్శించుకున్నారు. పలు ప్రాంతాల్లోని వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. – రాజేంద్రనగర్ జోన్ బృందం


అలకాపూర్ నక్షత్ర గేటెడ్ కమ్యూనిటీలో..


గ్రీన్ సిటీలో...


గగన్‌పహాడ్‌లో...


బండ్లగూడలోని సాయిశక్తి సింఫనీ వినాయకుడి వద్ద చిన్నారులు


పుప్పాలగూడలో.. కౌన్సిలర్ లక్ష్మీనారాయణ


కాపూరీ రిడ్జ్ గేటెడ్ కమ్యూనిటీలో..


హైదర్‌గూడ శివనగర్ కాలనీలో...


గండిపేటలో.. గోపాల గణేష్ తదితరులు


రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ వెంకటరమణా రెడ్డిను సన్మానిస్తున్న స్థానికులు


నిమజ్జనోత్సవంలో అశోకా లివియానా గేటెడ్ కమ్యూనిటీ వాసులు


పుప్పాలగూడ లక్ష్మీనరసింహాస్వామి ఆలయం వినాయకుని పూజలో మహిళలు


వినాయక నిమజ్జనంలో పాల్గొన్న చిన్నారులు


రషీద్‌గూడలో..


పంచవటి అపార్ట్‌మెంట్‌లో.. రూపారెడ్డి తదితరులు


నెక్నాంపూర్ వినాయకుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు జరగాలి

ఐసీఏఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ ఆర్‌కే సింగ్


వివిధ రకాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ఏజీవర్సిటీ: స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ విస్తణలో పరిశోధనలు జరుగాలని ఇండియాన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్(ఐసీఏఆర్) విస్తరణ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ ఆర్‌కే సింగ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని విస్తరణ విద్యా సంస్థ వజ్రోత్సవాల సందర్భంగా అభివృద్ధి చెందుతున్న వ్యవసాయ పర్యావరణ వ్యవస్థల కోసం కొత్తరకం విస్తరణ విధానాలు అన్న అంశంపై జాతీయ సదస్సు సోమవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఈ సదస్సు మూడు రోజుల పాటు జరుగనుంది. ఈ సందర్భంగా సింగ్ మాట్లాడుతూ.. దేశంలో రైతాంగానికి ఎప్పటికప్పుడు వ్యవసాయంలో అధునాతన పద్ధతులపై విస్తరణ సేవలు అందించడానికి 731 కృషి విజ్ఞాన కేంద్రాలు పనిచేస్తున్నాయని అన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలం రిజిస్ట్రార్ వెంకటరమణ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో ఎదుర్కొంటున్న కొత్త సవాళ్లని అధిగమించడానికి కొత్త పరిజ్ఞానాన్ని కనిపెట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తరప్రదేశ్‌లోని రాణీ లక్ష్మీబాయి కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఏకే సింగ్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పుల ఫలితాన్ని ఇప్పుడిప్పుడే మనం అనుభవిస్తున్నామని, ఈ ప్రభావాల్ని ఎదుర్కోవడానికి భారతదేశం సహా ప్రపంచ దేశాలన్ని ప్రత్యేక కార్యాచరణలని సిద్ధం చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రచురించిన 8 పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. సహజ సిద్ధమైన పదార్థాలతో ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు, మిలెట్స్‌తో తయారు చేసిన పదార్థాలు, ఎరువుల తదితర వస్తువుల ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ సుధారాణి, విస్తరణ విద్యా సంస్థ సంచాలకులు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, కోరమండల్ సంస్థ ప్రతినిధి డాక్టర్ సుబ్బారెడ్డి, మాజీ ఉపకులపతులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పండిత్ దీన్‌దయాళ్‌కు ఘన నివాళి


పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు


నివాళులర్పించిన సుధాకర్‌రెడ్డి తదితరులు

మణికొండ: దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతిని పురస్కరించుకుని సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలోని ఆయన నివాసంలో పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి ఎ.జైపాల్‌రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి బి.గణేష్, బీజేవైఎం జిల్లా కార్యవర్గసభ్యుడు జి. క్రాంతి, బీజేపీ నార్సింగి మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి జి. శివరాజ్‌లు పాల్గొన్నారు.

హైదర్‌గూడ చౌరస్తాలో..

అత్తాపూర్: రాజేంద్రనగర్ సర్కిల్ అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ చౌరస్తాలోని బేక్ అండ్ జాయ్ బేకరీ వద్ద అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సాబాధ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చేవేళ్ల పార్లమెంటు కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై నాయకులు, కార్యకర్తలతో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ పొన్నమోని మల్లేష్‌యాదవ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మోంద్ర కొమురయ్య, రాచూరి రాజశేఖర్, నల్లింగ్ రమేష్, సిద్ధేశ్వర్, రావుల జగన్, మనోహర్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


సయ్యద్ ఖైసర్ (ఫైల్)

అత్తాపూర్: మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం... అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హసన్‌నగర్‌కు చెందిన సయ్యద్ ఖైసర్ (69) ఈనెల 24న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా పోయాడు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు స్థానిక ప్రాంతాలు వాకబు చేసినా ఫలితం లేక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మికుడి అదృశ్యం..


సోమేల్ సోరేన్ (ఫైల్)

వెస్ట్ బెంగాల్‌కు చెందిన సోమేల్ సోరేన్ (36) అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శివరాంపల్లిలో నివాసముంటూ కార్మికుడిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. కాగా పని నిమిత్తం వెళ్లిన సోరేన్ కనిపించకుండా పోయాడు. దీనిపై కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సౌకర్యాల కల్పనలో గచ్చిబౌలికి పెద్ద పీట

శేరిలింగంపల్లి/రాయదుర్గం: మౌలిక సదుపాయాల కల్పనలో గచ్చిబౌలి డివిజన్‌కు పెద్దపీట వేశామని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్లలో రూ.22 లక్షలతో, శ్రీకృష్ణకాలనీలో రూ.20 లక్షలతో, నవోదయ కాలనీలో రూ.30 లక్షలతో, రాజీవ్ నగర్ కాలనీలో రూ.20 లక్షలతో, ఎన్టీఆర్ కాలనీలో రూ.33 లక్షలతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబాతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గచ్చిబౌలి, పరిసరాల్లో ప్రాంతంలో ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, హైదరాబాద్ నాలెడ్జి సిటీ ఉండడంతో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్ల విస్తరణ, లింకురోడ్ల నిర్మాణం పెద్ద ఎత్తున చేయడం జరిగిందని గుర్తు చేశారు. ప్రతికాలనీ, బస్తీలో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను చేపడుతున్నామన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి


కమిషనర్ శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్నేహితహిల్స్‌లో కనీస మౌలిక సదుపాయాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్రకు వినతిపత్రం అందజేశారు. కాలనీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా మట్టి రోడ్డుతో కాలం వెల్లదీస్తున్నామని వాపోయారు. పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు ఇంటి దగ్గరికి బస్సులు రాక దూరం వెళ్లి అది కూడా బురదలో నడుచుకుంటూ వెళ్తున్నారన్నారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, వీధిదీపాలు సక్రమంగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వినతిపత్రంలో పేర్కొన్నామన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని కాలనీలో పర్యటించి అన్ని సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, తిరుపతయ్యగౌడ్, జైరామయ్య, రవీందర్‌రెడ్డి, దాస్, సంగారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: విద్యార్థులు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆకాంక్షించారు. పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో సోమవారం ఆయన జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యాభ్యాసంలో క్రీడలను కూడా భాగంగా మార్చుకోవాలన్నారు. ప్రభుత్వం అన్ని వసతులతో కూడిన చక్కటి గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. క్రీడారంగానికి సైతం మంచి ప్రాధాన్యతను కల్పిస్తోందన్నారు. ప్రతి బస్తీలో క్రీడాప్రాంగణాలు కూడా ఏర్పాటు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్,

కాముని చెరువు రోడ్డు ప్రారంభం..

అన్నపూర్ణ చౌరస్తా నుంచి కాముని చెరువు వరకు అస్తవ్యస్తంగా ఉన్న రహదారిని ఇటీవల రూ.31లక్షల నిధులతో సీసీ రోడ్డు పూర్తి చేశారు. సోమవారం 8 వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ రోడ్డును ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా అస్తవ్యస్తంగా ఉన్న రహదారిని పూర్తి చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో మునిసపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్, కౌన్సిలర్లు వై. కుమార్, అజయ్, భద్రునాయక్, బీఆర్ఎస్ నాయకులు మురళి, తాజ్‌బాబా, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, డీసీ రవికుమార్, బీజేపీ నాయకులు

అత్తాపూర్: వినాయక నిమజ్జనోత్సవాలను పురస్కరించుకొని పెద్ద తాళ్లకుంట ప్రాంతాన్ని సోమవారం జీహెచ్ఎంసీ, పోలీసు, ఇతర విభాగాల అధికారులు పరిశీలించారు. వినాయక నిమజ్జనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్, బీజేపీ నాయకులు కొమురయ్య, శ్రీధర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్తంగా మహిళలకు సముచిత న్యాయం


రుద్రమదేవిని కలిసిన వెంకటేశ్

అత్తాపూర్: చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న నిర్ణయంలో భాగంగా దేశ వ్యాప్తంగా మహిళలకు సముచిత న్యాయం లభిస్తుందని బీజేపీ నాయకురాలు రాణి రుద్రమ దేవి అన్నారు. మహిళలకు చట్ట సభల్లో అత్యంత ప్రాధాన్యత కల్పించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కిందని బీజేపీ రంగారెడ్డి జిల్లా నాయకుడు సులిగే వెంకటేశ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి


మాట్లాడుతున్న కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్

బండ్లగూడ: పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించే సమయంలో తగు జాగ్రత్తలు పాటిస్తూ తమ ఆరోగ్యాలపై శ్రద్ధ వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్–2023 స్వచ్ఛతా హీ సేవలో భాగంగా సోమవారం కాళీమందిర్‌లోని పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో మెడికల్ హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్ అమీర్‌పేట్ ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ మహేందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పారిశుద్ధ్య నిర్వహణ సరిగ్గా ఉంటుందన్నారు. కార్మికులు తమ ఆరోగ్యం కాపాడుకుంటూ పనులు చేయాలన్నారు. కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. శానిటేషన్ సిబ్బంది నిరంతరం కష్టపడుతూ ఎనలేని సేవ చేస్తున్నారన్నారు. వారి ఆరోగ్యం కాపాడడం మన బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్, తలారీ చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి, అస్లాం, నాయకులు రాజురెడ్డి, ఖానాపాషా, రజాక్, ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి డాక్టర్ మీసాద్, డాక్టర్ తస్నీమ్, కోఆర్డినేటర్ రితేష్, సునీత, దుర్గ, తాతాజీ, మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

నాణ్యమైన మందులు ప్రజలకు అందుబాటులో ఉంచాలి


ఎమ్మెల్యేను కలిసిన నూతన మెడికల్ షాపు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: మెడికల్ షాపు నిర్వాహకులు నాణ్యమైన మందులు ప్రజలకు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే టీ. ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ మెడికల్ షాపు ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన కమిటీని అభినందిస్తూ మెడికల్ షాపు నిర్వాహకులకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ మీ సమస్యలు ఏవైన ఉంటే నా దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, లక్ష్మణ్ ప్రసాద్, ప్రమోద్, శ్రీనివాస్, రామారావు, విఘ్నేష్, ఈశ్వర్, వివేక్, పునీత్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల మానవహారం

శంషాబాద్: అంగన్‌వాడీల నిరసన కార్యక్రమాలు సోమవారానికి 15రోజులైంది. క్రమబద్ధీకరించడంతో పాటు వివిధ డిమాండ్ల నెరవేర్చాలని సోమవారం జాతీయ రహదారి పక్కనే మానవహారం ఏర్పాటు చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. ప్రభుత్వం వెంటనే డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఆశా వర్కర్లు కూడా తమ సమస్యలను పరిష్కరించాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మల్లేష్, అల్వాల్ తదితరులున్నారు.


జాతీయ రహదారి పక్కనే మానవహారంగా నిలబడిన అంగన్‌వాడీలు